# నిద్ర మొహం!

తెల్లవార లేచి ఇంటిదగ్గర్నుంచి బజారు కొచ్చినప్పట్నుంచీ మళ్ళీ సాయంత్రం కనుచీకటి పడ్డాక ఇంటికి వెళ్ళే లోపుగా– మనం లోకంలో ఎన్నెన్నో విచిత్రాలు చూస్తాం; ఎన్నో సంఘటనలు తటస్థపడతాయి; విభిన్న మనస్తత్వం గల వాళ్ళూ, విచిత్ర దృక్పథం గలవాళ్ళూ మన ఎదుట నిలుస్తారు; మన దృష్టిని తాత్కాలికంగా ఆకర్షిస్తారు ఆ మనుషులూ, సంఘటనలూ, ఆ వాతావరణమూ—కొంతకాలం వరకూ మన మనస్సు చుట్టూ ప్రదక్షిణాలు సల్పుతాయి.

మా వూరి భద్రయ్యను ఎవరైనా ఒకసారి చూడటం సంభవిస్తే–జీవితంలో మర్చిపోవడం జరగదని సులభంగా చెప్పొచ్చు. ఆకాశంలో తోకచుక్కనీ, పంటకాలువ గట్టు మీద మూడు తలల నాగునీ, అడవిలో ఖడ్గమృగాన్నీ తెల్లని వెన్నెలో వర్షాన్ని – ఒకసారి చూస్తే ఎట్లా మర్చిపోమో, భద్రయ్యను చూస్తే అట్లా మర్చిపోరు భద్రయ్యలో ఉన్న

విచిత్రమేమిటి? అతను ఆకులు రాలిన సర్వీ చెట్టులాగా, పి. డబ్లు. డి. వారి పది అడుగుల బద్దలాగా — అమితమైన ఎత్తా! కాదు మరి. అతను రోడ్డుమీద రోడ్డు రోలరులాగా రోతగా కనబడే లావా? కాదు. అతని ముఖం కొలను కొండ రాయిలాగ, అతని ముక్కు రాం ములక్కాయలాగ, అతని కళ్ళు పిల్లికళ్ళలాగ అతని చెవులు ఏనుగు చెవుల్లాగ, అతని వాళ్ళు రాక్షసి బొగ్గులాగ-వుంటాయా? వుండవు. అతను గ్రుడ్డివాడా? ముమ్మాటికీ కాదు. మరి అతనిలో ఉన్న విచిత్ర మేమిటి? ఒక్కసారి చూడగా అతన్ని జ్ఞాపకం పెట్టుకోవా ల్సిన అగత్య మెక్కడుంది?

మా వూళ్ళో మిగతా ప్రజకూ, భద్రయ్యకూ గల భేదాన్ని ఎత్తిచూపే ముఖ్య గుణం. ప్రత్యేకత—అతని నిద్ర మొహమే! నిత్యమూ మనం ప్రతిచోట నిద్ర మొహాన్ని చాలా అరుదుగా చూడటం జరుగుతుంది. ఊళ్ళో అంతా అతన్ని "నిద్ర మొహం భద్రయ్య" అనే పిలవడంచేత అతని నిద్ర మొహానికి ప్రాముఖ్యత పెరిగింది. నేను చాలా నిద్ర మొహాల్ని చూశానుగానీ—వాళ్ళెవ్వరూ భద్రయ్యకు సరి రారు. భద్రయ్యది మూర్తీభవించిననిద్ర మొహం ఇది రాత్రో పగలోకూడా తెలిసికోలేని నిద్ర మొహం. అతనికి ఆనిద్ర పెద్ద మ్మారు పుట్టిన ఏడాదికే ఆవరించిందని అనుకుంటారు. అప్ప ట్నుంచీ ఇప్పటివరకూ ఆ జబ్బు అతన్ని వొదిలిపెట్టలేదు. పుట్టుకతో వచ్చిన జబ్బు పుడమిపై వున్నంతకాలమూ వుం టుంది" ఊళ్లోవాళ్ళు ఆవిధంగా తీర్మానించుకున్నారు.

భద్రయ్య తలిదండ్రులు అతని నిద్ర మొహాన్ని వొదలగొట్టేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఎంతోమంది డాక్టర్లకు చూపించారు. కొసకు వాళ్ళు ఆ దిగులుతోనే కాలధర్మం చెందారు. భద్రయ్యలో ఒక గొప్ప గుణంవుంది. అదే ఓర్పు. మూడేళ్ళ పిల్లవాడి దగ్గర్నుంచీ, అరవైయేళ్ళ ముసలివాళ్ళవరకూ "నిద్రమొహం" అని ఎంత ఎగతాళి చేసినా, చిరునవ్వు నవ్వుతాడుగానీ చిరుకోపంకూడా ప్రదర్శించడు.

భద్రయ్య స్కూలుఫైనలు వరకూ చదువుకున్నాడు. కాని స్కూలు ఫైనలుగేటు దాటలేదు. పాపం, సాధ్యపడలేదు. అతగాడు మూడుసార్లు పరీక్షకెళ్ళాడు. మొదటిసారి పరీక్షరోజు టీ తాగి, అయిదు నిముషాలకోసారి చల్లని నీళ్ళతో కళ్లు తుడుచుకొని ఆసనాలువేసి ఎలాగైతేనేం రాత్రి 12 గంటలవరకూ చదివి తీరా పరీక్ష టైమువరకూ నిద్ర నుంచి లేవలేదు. ఆ సంవత్సరం అలా పరీక్షపోయింది. రెండోసారి పరీక్ష కెళ్ళినప్పుడు అప్పుడే భోజనం చేసిరావడంచేత పరీక్ష హాల్లో పేపరు వ్రాయటానికి బదులు అరగంటసేపు నిద్రపోయాడు గాఢంగా. వాచర్లు నిద్రలేపి ముఖంపైన నీళ్లు చల్లగా _ మిగతా పేపరు నిద్రమొహంతోనే వ్రాసి ఆ పేపర్లో నూటికి పదిహేను మార్కులు తెచ్చుకొని పప్పులో కాలు వేశాడు. మూడోసారికూడా నిద్రమొహంవల్లనే అతను తప్పడం జరిగింది. ఆపైన తన బ్రతుక్కి చదువు లాకీ కాదని ఉద్యోగం తనకి శ్రేయస్కరం కాదని_మనసును సరిపెట్టుకొని

స్కూలుఫైనలు ప్యాసయేందుకు ప్రయత్నాలు పూర్తిగా మానుకొని - వ్యాపారంలోకి దిగాడు భద్రయ్య.

భోజనం చేయగానే నిద్రబోయే అలవాటు చాలా మందికి ఉంటుంది. భద్రయ్యకు ఉండటంలో వింత ఏమీలేదు. కాని అతను కాఫీ త్రాగినా, చివరకు టిఫిన్ తిని మంచినీళ్ళు త్రాగినా_నిద్రబోయేందుకు తల ఆడిస్తాడు వాటంతటవే కనురెప్పలు అలవాటుగా మూసికొనిపోతాయి.

భద్రయ్య నిద్ర మోహం అతన్ని ఓ విధాన ప్రమాదాలకీ, నవ్వులపాలకి, అవమానాలకీ, బాధలకూ గురి చేయలేదు. ఒకరోజు బస్సులో గుంటూరు వెళ్ళడం జరిగింది. అప్పుడే భోజనంచేసి బస్సు ఎక్కాడు. బస్సు కదలగానే కళ్లు బ్రాందీ తాగినవాడిలా భారంగా మూసుకు పోయినాయి. అతని ప్రక్కనే పద్ధెనిమిదేళ్ళ నవయౌవ్వన సుందరాంగి కూర్చున్నది. నిద్రమత్తులో భద్రయ్య వొళ్ళు తెలియకుండానే_నైలాన్ జాకెట్టుతో మెత్తగా, మెరుగ్గా వున్న ఆమె భుజాలపైన మెల్లగా తలపెట్టి నిద్రబోయాడు. బస్సులోవున్న వాళ్ళంతా ఆ దృశ్యాన్ని కనులార చూశారు, ఆసుందరాంగి ఆ అవమానానికి మగవాడి వొళ్ళు తెలియని మదానికీ, నిద్ర మత్తుకూ _ కళ్ళు కొలిమిలో నిప్పుకణాలు కాగా. గుండె ఎండలో మండే బండ కాగా గబుక్కున కాలికున్న హైహీల్ బూట్‌ను తీసి_ భద్రయ్య చెంపను చెళ్ళుమనిపించింది. బస్సు బేకులు బ్యావ్ మన్నాయి. అతని వొళ్ళు ఝల్లుమనగా _ చెంపమీద చేయి పెట్టుకొని జరిగిన అపచారానికి పట్టిన

గతిని తలచుకొని కిక్కురుమనకుండా సర్దుకు కూర్చున్నాడు. పాపం, బస్సులో జనమంతా అతనికేసి వింతగా, సానుభూతిగా చూడగా — తల ఎత్తి వాళ్ళకేసి చూడలేకపోయాడు భద్రయ్య.

రైళ్ళు — ముఖ్యంగా రాత్రిపూట భద్రయ్యకు అందటంలేదు అరుదు. అంటే అతను ఆలస్యంగా స్టేషనుకు వస్తాడని కాదు. ఓ గంటముందు స్టేషనుకొచ్చి ప్లాట్ ఫారం బల్లమీద శ్రీమన్నారాయణుని పోజులో పడుకొని కళ్ళుమూస్తాడు రైలు రావటం-పోవటం ప్లాట్‌ఫారంమీద గోల — ఆ నిద్రలో అతనికేమీ వినిపించవు ఎవరేనా తోటిప్రయాణికులు దయదల్చి అతన్ని నిద్రనుంచి లేపితేసరి — లేదా ఆ రోజు తారీఖు మారినా అక్కడే వుంటాడు. అధవా ఎక్కేసారి రైలెక్కినా తన స్టేషను వొచ్చినా నిద్రమత్తులో తెలిసికోకుండా — నాలుగైదు స్టేషన్లుదాటి, అక్కడ తిరుగు బండికి దిగి మళ్ళీ గమ్యస్థానికి చేరుకుంటూ వుంటాడు. కనుక భద్రయ్యకు రైలు ప్రయాణం శ్రేయస్కరం కాదుగనుక అతనెప్పుడూ బస్సుమీదనే ప్రయాణం చేస్తాడు. బస్సు ఆగినచోట అతను నిద్రపోయినా — బస్సు క్లీనరో, కండక్టరో భుజంతట్టి లేపుతారు గనుక యిబ్బందిలేదు.

భద్రయ్య పెళ్ళికి నేనువెళ్ళడం పడలేదు గానీ. వెళ్ళిన వాళ్లు చెప్పారు అతని పెండ్లి ముహూర్తం రాత్రి ఒంటిగంటకట. పాపం భద్రయ్య అప్పటి వరకూ మేల్కోగలడా! అయినా పెళ్ళిపెద్దలు అతన్ని నిద్రపోనీయకుండా కబుర్లుచెప్పీ, టీలు త్రాగించీ, సిగరెట్లు కాల్పించీ — ఆ ముహుర్తంవరకూ

కాపాడారట. పెండ్లి పీటలమీద కూర్చున్న తర్వాత నిద్రాదేవి ముందుగా అతన్ని ముద్దుపెట్టుకుందిట. పెళ్ళికూతురు కేసి కూడా కనురెప్పలు తెప్పి తిరిగ్గా చూడలేక పోయాడట. పెండ్లికూతురు మెడలో తాళి కట్టబోయి, నిద్రమత్తులో ఆమెజడకు కట్టాడట. పెళ్ళి పెద్దలంతా ఫక్కున నవ్వారట ఆడపెళ్ళివారి గోలకు అంతులేకపోయిందట. అప్పటికీ భద్రయ్య నిద్రమత్తు జారిపోలేదుట. తన తప్పు తెలిసికోలేదుట. తలంబ్రాలం పోసే సమయంలో ముందు దోసెడు తలంబ్రాలు పురోహితునిమీద గ్రుమ్మరించాడట. పెళ్ళిపందిరి మళ్ళీ కడుపు చెక్కలయ్యే నవ్వులతో అటూ యిటూ కదులాడిందట.

ఒకసారి భద్రయ్య అతని నిద్రమత్తువల్ల యేర్పడ్డ ప్రమాదాన్నిగురించి వున్న రహస్యాన్ని చెప్పాడు. ఈ రహస్యం మా వూళ్ళో చాలామందికి తెలీదు ఒకనాటి మధ్యాహ్నం తన గొడ్ల చావట్లో భద్రయ్య కుక్క మంచంలో పడుకొని _ తాజ్‌మహల్ బీడీ కాలుస్తూ హఠాత్తుగా నిద్రబోయాడు. అతను నిద్రపోతూండగా చేతి వ్రేళ్ళ మధ్య సగంకాలి, కాలుతూన్న తాజ్‌మహల్ బీడీ అల్లానే వుంది. ఆ మంచంక్రింద చెత్తఉన్నది. నిద్రలో ఆ బీడీ యెప్పుడో తెలీకుండా జారవిడిచాడు ఆ బీడీ నిప్పుచెత్తలో పడి_అంటుకుంది. పొగ రగిలింది. పైకి లేచింది మంట మండింది. ఆ మంట ఊరి చావడి మచ్చుమీదనున్న గోగు పుల్లల మోపులకు అంటుకుంది. ఆ పైన సులభంగా చావడికే అంటుకుంది. ఊరంతా కోలాహలంగా వూరు తగలబడిపోతోందనే గోలతో అక్కడికి కదిలివొచ్చింది. అప్పుడు ఆ పొగ సుడుల్లో దగ్గుకుంటూ

బయటికొచ్చాడు భద్రయ్య. అందరూ "ఎలా నిప్పుముట్టు కున్నది?" అని ప్రశ్నించిగా "ఏమో" అన్నాడు భద్రయ్య. నిద్ర మొహంవల్ల భద్రయ్య పొందిన అవమానాలు, నష్టాలు, చిక్కులు, బాధలు – సమగ్రంగా వర్ణించాలంటే చిన్న కథలో వీలుపడదు నవలా రూపంలో చిత్రించాల్సిందే!

ఒకరోజు సాయంత్రం భద్రయ్య నా దగ్గర కొచ్చాడు చుట్ట కాల్చుకుంటూ.

"ఏంభద్రయ్యా! బీడీలు త్రాగటం మానేశావేమిటీ" అన్నాను నేను.

"అవునండీ! నా నిద్ర మొహానికి బీడీలు ప్రమాదం. చుట్టఅయితే నిప్పు నుసి రాలినా, చురచుర వేసికొని పోదు" అన్నాడు భద్రయ్య.

"అయితే, ఈ నిద్ర మొహం నిన్ను వొదిలిపోయే మార్గంలేదా భద్రయ్యా!"

"ఆ మార్గ మేదైనా చెబుతారేమోనని మీ దగ్గర కొచ్చాను" అన్నాడు భద్రయ్య కుర్చీలో కూర్చుంటూ.

"నేనేం చెప్పగలను? నేనేమైనా డాక్టరునా!" అన్నాను ఆశ్చర్యంగా.

"డాక్టర్లవల్ల ప్రయోజనం లేకపోయిందండి. ఆ మందులు నా నిద్రమత్తును మరీ పెంచుతున్నాయిగానీ, పోయే మార్గాన్ని చూపెట్టడంలేదు. మీరే ఏదైనా సలహా చెప్పాలి. ఇంకా ఉపేక్ష చేస్తే — ఈ నిద్ర మొహంతోనే నా బ్రతుకు ఏ సౌఖ్యమూ లేకుండా తెల్లవారిపోతుంది. మీరు మాస్తు

న్నారుగా — నే పడే నవ్వుల పాట్లనూ, ఇబ్బందులనూ! మొన్న కిళ్ళీకొట్టు నరసయ్య "భద్రయ్యా! నువ్వు పాతిక రూపాయల చేబదులు నా దగ్గర తీసుకున్నావయ్యా!" అన్నాడు. నేను నిద్రమత్తులో వుండి "ఊఁ! ఇస్తాలే!" అన్నాను. కాని తీరా తిరిగి చూచుకుంటే — వాడి దగ్గర చిల్లి కానీ కూడా తీసుకున్నట్టు జ్ఞాపకం లేదు. ఎప్పుడు లెక్క చేసినా అక్షరాలతో సహా నోటు బుక్కులో వ్రాసుకుంటాను. నరసయ్య దగ్గర తీసుకున్న చేబదులు బుక్కులో లేదు. వీళ్ళతా నా నిద్రజబ్బును అవకాశంగా వినియోగించుకొని నన్ను పిచ్చి వాణ్ణిచేసి - నాదగ్గర డబ్బు గుంజాలని చూస్తున్నారు. ఇంత అన్యాయం యెక్కడేనా వున్నదా?" అన్నాడు భద్రయ్య బాధాకరంగా.

భద్రయ్య స్థితి చూడగా నాకు సానుభూతి జాస్తి అయ్యింది.

"భద్రయ్యా! నీలో మనోబలమూ, సంకల్ప సాధనా, దీక్షా వుంటే - ఈ జబ్బును యిట్టే పోగొట్టుకోవచ్చు. నిద్ర మత్తును పోగొట్టుకోవాలి" అని మనస్సులో తీవ్రంగా తీర్మా నించుకొని - ఆ తీర్మానాన్ని అక్షరాలా ఆచరణలో పెట్టేం దుకు నడుంబిగిస్తే కృతకృత్యుడవు కాలేకపోతావా? మనోబలం అనుకూలించనిదిమందులబలం పని చేయదు" అన్నాను సలహా రూపంగా.

భద్రయ్య పెదవి విరిచాడు.

"నిద్రమత్తులో దెబ్బ తిన్నప్పుడల్లా - తీవ్రంగా తీర్మా

నించుకుంటాను. "ఇక ఈ రోగానికి స్వస్తి చెప్పాలని, మెలకువగా వుండాలని ఏం లాభం? చివరకు యేడుకొండలస్వామికి కూడా నూటొక్క కొబ్బరికాయలు కొట్టి, సతీ సమేతంగా తలవెంట్రుకలు సమర్పిస్తానని మ్రొక్కుకున్నాను. కాని ఇంకా ఆ స్వామికి నాపైన దయరాలేదు.

"అయితే భద్రయ్యా! నీ జబ్బు నయంకావాలంటే— నీ జీవితంలో ఒక గొప్ప సంఘటన జరగాలి. ఆ సంఘటనవల్ల నీ రోగం తిరుగుముఖం పట్టవచ్చు. ఆ సంఘటన ఎట్లా ఏర్పడుతుందో చెప్పడం ఎట్లా? కొంతమంది జీవితాల్లోని లోపాలు - బాధలు - కొన్నికొన్ని దైవసంఘటనలతో సమాప్తి జెందుతాయి" అన్నాను నేను అంతకంటె మరే సలహా యివ్వలేక.

కాని నా మాటలు భద్రయ్యకేమీ రుచించలేదు పైగా మెట్టవేదాంతంలాగ కనబడ్డాయి. ముఖం రవ్వంత చిట్లించుకున్నాడు.

"నిద్రమత్తును ఒదిలించుకొనే ఉపాయం నాకొకటి కనబడుతూంది" అన్నాడు నెమ్మదిగా భద్రయ్య.

"ఉపాయం కనబడితే వెంటనే ఆచరించు. యేమిటది?"

"ఏమీ లేదు నిద్రమత్తు వచ్చినప్పుడు, గాడిపొయ్యిలో ఎర్రగాకాలిన అట్లకాడను చెంపమీద వాతగా పెట్టుకుంటే - నిద్రమత్తు ఒదిలిపోతుందని" అన్నాడు భద్రయ్య తేలిగ్గా.

నా గొంతులో గిన్నెడు ఆముదం గ్రుమ్మరించినట్లయింది. నెత్తురు చిందేట్టు నాలిక కొరుక్కున్నాను.

"భద్రయ్యా! అంతపనిమట్టుకు చేయబోకు. నిద్రమత్తువుంటే వుందిగానీ — బంగారంలాంటి చెంపమీద వాతపెట్టుకుంటా వేఁవిటి? చెవిలోనిపోటు భరించలేక, బ్లేడుతో చెవినే కోసుకున్నాట్ట మోటుపనులు చేస్తానంటా వేఁమిటి? ఎవరన్నా వింటే నవ్విపోతారు. ఆ దారుణానికి మటుకు దిగబోకు. నీ రోగం నయమమే రోజువస్తుంది. ప్రతి జీవికీ జీవితంలో కొన్ని మంచిరోజులంటూ వుంటాయి. అవి ప్రవేశించగానే ఉన్న బాధలూ, దారిద్ర్యమూ, లోపాలు వాటంతటవే సర్దుమణుగుతాయి" అన్నాను భవిష్యత్తులోని మంచిని సులభంగా వినరిస్తూ.

నా మాటలమీద విశ్వాసాన్ని వుంచనీయండివుంచకపోనివ్వండి — భద్రయ్య నూరు మాట్లాడకుండా అప్పటికి ఇంటికి వెళ్ళిపోయాడు. కాని భద్రయ్యమటుకు గాడిపొయ్యిలో ఎర్రగా కాలిన అట్లకాడతో చెంపమీద వాతిపెట్టుకోలేదు. అతని నిద్ర మొహంలో కూడా యేమీ మార్పు రాలేదు. ఊళ్ళో పిన్నలూ, పెద్దలూ అతన్ని "నిద్రమొహం" అంటూనే ఎగతాళి పట్టిస్తూనే ఉన్నారు.

భద్రయ్య నా దగ్గరకొచ్చి వెళ్ళిన రెండు నెలలతర్వాత ఓ రోజు మధ్యాహ్నం మా యింటి వరండాలో పడకకుర్చీలో కూర్చుని వార్తా పత్రిక చదువుకుంటూవుండగా మా పాలేరు వొచ్చి—

"భద్రయ్యగారు నిన్న తెనాల్లో గాంధీచౌకు దగ్గర కారుక్రింద పడ్డారంట. ఆస్పత్రిలో చేర్చినారంట" అన్నాడు

కుర్చీలోంచి చటుక్కునలేచాను. "అయ్యో! పాపం!" అన్నాను అప్రయత్నంగా.

ఆ క్షణంనుంచీ నా మనస్సు అతన్ని చూసేందుకు తహతహ లాడింది. ఆ సాయంత్రమే కాఫీ త్రాగాక బయలు దేరి బస్సులో తెనాలివెళ్ళి ధర్మాసుపత్రిలో భద్రయ్యను కలుసుకున్నాను.

భద్రయ్యకు బాగా దెబ్బలు తగిలాయి. తలకూ, ముఖానికీ మోకాళ్ళకూ కట్లు కట్టబడి ఉన్నాయి. కాని ఆయాసం లేకుండానే మాట్లాడుతున్నాడు.

"ఎట్లా జరిగింది ప్రమాదం? కారు నీ మీదుగా పోయిందా? కారుక్రింద నీవుపడ్డావా?" అన్నాను.

ఎందుకో చిరునవ్వు నవ్వాడు భద్రయ్య ఆ స్థితిలో కూడా.

"మీ మాటలు యిప్పుడు అక్కరకొచ్చాయి. జీవితంలో ఏదో ఒక సంఘటన జరిగితేనే గానీ — యీ జబ్బు తిరుగు ముఖం పట్టదని మీరు ఒకసారి నాతో అన్నారు జ్ఞాపకం ఉన్నదా? ఆ సంఘటన నిన్న నా జీవితంలో జరిగింది. దాని ఫలితమే యీ ఆస్పత్రివాసం. దెబ్బలు తగిలితే మటుకేం. ఎన్నాళ్ళుగానో నాలో జీర్ణించుకు, ఎన్ని మందులువాడినా, ఎన్ని ప్రతిజ్ఞలు చేసినా, ఎందరి దేవుళ్ళకు మ్రొక్కుకున్నా —వొదిలిపోని నిద్రమత్తు జబ్బు — ఈ దెబ్బతో దూలాన

ఉన్న బూజు రాలినట్టు వొదిలిపోయింది. అదే నాకు కావాల్సింది" అన్నాడు భద్రయ్య సంతృప్తి పడుతూ.

నాకూ ఎంతో సంతోషం వేసింది.

"అసలు ప్రమాదం ఎట్లా సంభవించింది."

"ఏముంది? మిలిటరీ హోటల్లో అరప్లేటు కోడి ఫలావు దిట్టంగాతిని మిఠాయికిళ్ళీ వేసికొని - చార్మినార్ సిగరెట్టు వెలిగించి సైకిలెక్కాను చినరావూరు వెళ్ళివద్దామని. కాని పదిగజాలు వొచ్చానో లేదో, సైకిలు త్రొక్కుతున్నా. రోడ్డుమీద కావాల్సినంత సందడి వున్నా—నిద్ర ముంచుకొచ్చింది. గాంధీచౌకులో రోడ్డుమలుపు తిరుగుతూ ఎదురుగ్గా వొచ్చే కారుక్రిందకు నిద్రమత్తులో సైకిల్ని వెళ్ళనిచ్చాను. అదే ప్రమాదం! అందరూచేరి ఆస్పత్రిలో చేర్చారు. కాని ఆ ప్రమాదం నా జీవితానికి ప్రమాదంకాదు; శుభ ముహూర్తం! చూడండి నా నిద్రమొహం జారిపోయింది. ఊళ్ళో ఇంక నన్నెవ్వరూ "నిద్రమొహం భద్రయ్యా!" అని పిలవడానికి అవకాశంలేదు. ఏమంటారు?" అన్నాడు భద్రయ్య ఉత్సాహంగా.

భద్రయ్య ధర్మాసుపత్రిలో పదిరోజులపాటు ఉన్నాడు. ఆ పది రోజులూ రాత్రుళ్ళు తప్ప పగటిపూట నిద్రపోయి యెరుగడు. మనిషి యెంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా, రిలీఫ్‌గా ఉన్నాడు. లోకం స్పష్టంగా అగపడుతూంది. "పునర్జన్మ ఎత్తినట్టుగానే భావిస్తున్నాడు. భద్రయ్య. కాఫీ త్రాగినా

టిఫిన్ తిని మంచినీళ్లు త్రాగినా, భోజనం చేసినా — అతని కిప్పుడు నిద్ర ముంచుకు రావటంలేదు.

భద్రయ్య ఊళ్ళోకి సగర్వంగా చిరునవ్వు నవ్వుకుంటూ వొచ్చాడు. క్రమంగా అతన్ని "నిద్ర మొహం" అని పిన్నలూ — పెద్దలూ పిలవడం మానివేశారు. అత నిప్పుడు నిద్ర మొహం భద్రయ్య కాదు, మామూలు భద్రయ్యే!

—ప్రజామత

కథా నిలయం
5949